



బాబుకు నాగలి బహూకరణ

చంద్రబాబు సభకు అశేషంగా తరలి వచ్చిన జనాలు



ఇక మిగిలింది 73 రోజులే..!



- జగన్‌ను ఇంటికి సాగనంపండి
- కర్నూలుకు హైకోర్టు బెంచ్ బాధ్యత నాది
- 'సూపర్ సిక్స్'తో పేదరికాన్ని నిర్మూలిస్తా
- పత్తికొండ బహిరంగ సభలో టీడీపీ అధినేత చంద్రబాబు

కర్నూలు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి)/పత్తికొండ: 'జెండాలు పట్టండి.. జనాల్లోకి వెళ్లండి.. ఇక మిగిలింది 73 రోజులే.. రాబోయే ఎన్నికల కురుక్షేత్రానికి సిద్ధంగా ఉండండి.. వై నాట్ 175 అంటున్న జగన్మోహన్‌రెడ్డిని ఇంటికి సాగనంపండి.. అని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. పత్తికొండలో ఆదివారం జరిగిన రా.. కదలిరా బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఈ 73 రోజులు కష్టపడితే.. ఈ రాష్ట్రానికి పట్టిన సైకో జగన్ పీడ విరుగడవుతుందని, రాష్ట్ర భవిష్యత్తే మారిపోతుందని అన్నారు. పత్తికొండ సభను చూస్తే సైకో జగన్‌కు రాత్రి నిద్రపట్టదని, తాడేపల్లి ప్యాలెస్‌లో టీవీలు పగిలిపోతాయని అన్నారు. ప్రజల ఉత్సాహాన్ని చూస్తే టీడీపీ-జనసేన గెలుపును ఎవరూ ఆపలేరని పేర్కొన్నారు. 'ఉరవకొండ, పీలేరు సభల కంటే పత్తికొండ సభ దద్దరిల్లిందని, యువత బాధ, రైతు వ్యథ, వలస రైతుల ఆక్రందన, ఉద్యోగుల బాధలు, దగా పడ్డ యువత ఆక్రోశం మీలో కనిపిస్తోందని, మీకు భరోసా ఇస్తున్నా'.. కర్నూలు జిల్లాను బాగు చేసే బాధ్యత టీడీపీ-జనసేన ప్రభుత్వం తీసుకుంటుందని అన్నారు. దీంతో జనాలు రెట్టింపు ఉత్సాహంతో కేరింతలు కొట్టారు.

సూపర్ సిక్స్‌తో పేదరిక నిర్మూలన:

టీడీపీ, జనసేన అధికారంలోకి వచ్చాక సూపర్ సిక్స్ పథకాలు అమలు చేసి పేదరికాన్ని నిర్మూలిస్తానని టీడీపీ అధినేత అన్నారు. ఇంట్లో ఎంతమంది మహిళలు ఉంటే అంత మందికీ మహాశక్తి కింద నెలకు రూ.1,500, తల్లికి వందనం కింద ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతుంటే అంతమందికి ఏడాదికి రూ.15 వేల చొప్పున సాయం అందిస్తామని చెప్పారు. మూడు సిలిండర్లు ఉచితంగా ఇవ్వడంతోపాటు ఆర్టీసీల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తామని హామీ ఇచ్చారు. అన్నదాత పథకం కింద ప్రతి రైతుకు రూ.20వేల ఆర్థిక సాయం అందిస్తామని, యువగళం కింద లక్షల ఉద్యోగాల నియామకం కల్పిస్తాం స్పష్టం చేశారు. ఇంటింటికి సురక్షిత నీరందిస్తామని, బీసీలకు రక్షణ చట్టం తెస్తామని భరోసా ఇచ్చారు. జగన్ పాలనలో అధ్వానంగా మారిన రాష్ట్రాన్ని బాగు చేసే బాధ్యత తీసుకుంటానని చంద్రబాబు పునరుద్ఘాటించారు.

కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు

గత ఎన్నికలకు ముందే కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చానని చంద్రబాబు ఉద్ఘాటించారు. అందుకు కట్టుబడి ఉన్నానని చెప్పారు. ఈ జగన్ వచ్చాక మూడు రాజధానుల పేరుతో దగా చేశాడని. టీడీపీ, జనసేన ప్రభుత్వం రాగానే కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేసే బాధ్యత తీసుకుంటాననీ చంద్రబాబు స్పష్టమైన హామీ ఇచ్చారు.

పేరుపేరునా పలకరింపు

చంద్రబాబు హెలిప్యాడ్‌కు రాగానే టీడీపీ కార్యకర్తలు ఉవ్వెత్తున అక్కడికి చేరుకున్నారు. చంద్రబాబును చూసేందుకు పోటీ పడ్డారు. అక్కడి నుంచి వేదికపైకి చేరుకున్న చంద్రబాబు జిల్లా నాయకులను పేరుపేరునా పలకరించారు. నాయకులు అధినేత చంద్రబాబుకు పూలబొకేలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.





కోట్ల సుజాతమ్మతో భూమా దంపతులు



రాక్షస పాలనపై విల్లు ఎక్కుపెట్టిన చంద్రబాబు



ఎన్టీఆర్‌కు నివాళి



వేదికపై నంద్యాల ఇన్‌చార్జి ఫరూక్, జనసేన నాయకులు



చంద్రబాబు నాయుడుతో గోగిశెట్టి నరసింహారావు

నంద్యాల జిల్లా కలెక్టర్‌గా శ్రీనివాసులు

మనజీర్ జిలానీ సమూన్ శ్రీకాకుళానికి బదిలీ



కె.శ్రీనివాసులు

నంద్యాల (నూనెపల్లె), జనవరి 28: రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ఐఏఎస్‌ల బదిలీల్లో భాగంగా నంద్యాల జిల్లా కలెక్టర్ డా.మనజీర్ జిలానీ సమూన్ శ్రీకాకుళానికి బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో బాపట్ల జాయింట్ కలెక్టర్ కె.శ్రీనివాసులును ప్రభుత్వం నియమించింది. నెల్లూరు జిల్లా సీతారాంపురం మండల కేంద్రానికి చెందిన కె.శ్రీనివాసులు 2007-08లో గ్రూప్-1 అధికారిగా శిక్షణ పొందారు. 2008 నుంచి 2011 వరకు అప్పటి గుంటూరు జిల్లా నరసరావుపేట ఆర్డీవోగా, 2011 నుంచి 2012 వరకు కడప జిల్లా రాజంపేట ఆర్డీవోగా పని చేశారు. 2012 నుంచి 2014 వరకు ఖమ్మం జిల్లా డ్వామా పీడీగా, 2014 నుంచి 2015లో పులిచింతల ప్రాజెక్టులో పని చేశారు. 2015-2019 వరకు విశాఖపట్టణం, పశ్చిమగోదావరి జిల్లాల డీఆర్‌డీఏ పీడీగా బాధ్యతలు నిర్వర్తించారు. 2016లో ఐఏఎస్‌కు ఎంపికైన శ్రీనివాసులు 2019 నుంచి 2022 వరకు శ్రీకాకుళం జాయింట్ కలెక్టర్‌గా పని చేశారు. జిల్లాల పునర్విభజన అనంతరం 2022 నుంచి ఇప్పటివరకు బాపట్ల జేసీగా పని చేశారు. ఐఏఎస్‌ల బదిలీల్లో భాగంగా శ్రీనివాసులును నంద్యాల జిల్లా కలెక్టర్‌గా నియమించారు. కర్నూలు జిల్లా జేసీగా పని చేసిన మనజీర్ జిలానీ సమూన్ జిల్లాల పునర్విభజనలో నంద్యాల జిల్లాకు కలెక్టర్‌గా పని చేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకు జిల్లా కలెక్టర్‌గా ఆయన బాధ్యతలు నిర్వర్తించి శ్రీకాకుళం జిల్లా కలెక్టర్‌గా బదిలీ అయ్యారు.

ఎవరూ రారులే అనుకున్నారేమో..!



ఉదయం 8.30 గంటలైనా ఆలయం తలుపులు తీయకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్న శారదా మఠం పీఠాధిపతి

- 8.30 గంటలైనా ఆలయ తలుపులు తెరవని పురోహితులు
- కొలనుభారతికి వచ్చి ఇబ్బంది పడిన భక్తులు
- ఆగ్రహం వ్యక్తం చేసిన శివ యోగీంద్ర సరస్వతి స్వామీజీ


కొత్తపల్లి, జనవరి 28: నల్లమల అడవుల్లో ఉన్న కొలనుభారతి ఆలయానికి ఎవరు వస్తారులే అనుకున్నారేమో.. ఆదివారం ఉదయం 8.30 గంటలైనా పురోహితులు అమ్మవారి గుడి తలుపులు తెరవలేదు. అదే సమయానికి కాకనూరు శారద మఠం పీఠాధిపతులు శివ యోగేంద్ర సరస్వతి స్వామీజీతోపాటు నరసరావుపేటకు చెందిన కొందరు భక్తులు అమ్మవారి దర్శనం కోసం వచ్చారు. స్వామీజీ రాకను గమనించిన పురోహితులు, అక్కడి సిబ్బంది అప్పటికప్పుడు ఆలయాన్ని శుభ్రం చేస్తుండటంతో స్వామీజీ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయపాలన పాటించకుండా ఇష్టానుసారంగా విధులకు హాజరైతే.. దేవదాయ శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ముగ్గురు పురోహితులకుగాను ఒక్కరు మాత్రమే హాజరు కావడంతో అక్కడకు వచ్చిన భక్తులు సైతం ఇబ్బందులు పడ్డారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుంచి సరస్వతి అమ్మవారి దర్శనం కోసం భక్తులు వస్తే.. ఇక్కడి పురోహితులు ఇష్టమొచ్చినట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా చూసుకోవాలని సూచించారు. ఈ ఆలయానికి రెగ్యులర్ ఈవోతోపాటు అటెండర్‌ను నియమించాలని త్వరలో కమిషనర్‌ను కలవనున్నట్లు ఆయన తెలిపారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న శారదా మఠం పీఠాధిపతి శివ యోగేంద్ర సరస్వతి స్వామీజీ

8 మంది ఎస్‌ఐలకు స్థాన చలనం

కర్నూలు, జనవరి 28: ఉమ్మడి కర్నూలు రేంజ్ పరిధిలో 8 మంది ఎస్‌ఐలను బదిలీ చేస్తూ ఆదివారం డీఐజీ సెంథిల్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలులో పని చేస్తున్న ఎస్.బాల నరసింహుడిని కోడుమూరుకు, అక్కడ పని చేస్తున్న ఏపీ శ్రీనివాసులును నాగులాపురానికి బదిలీ చేశారు. గోనెగండ్ల ఎస్‌ఐ తిమ్మారెడ్డిని సి.బెళగల్‌కు, బెళగల్ ఎస్‌ఐ జె.మన్మథ విజయ్‌ను కర్నూలు త్రీటౌన్‌కు, ఆదోని టూటౌన్ ఎస్‌ఐ జి.పెద్దయ్య నాయుడును హొళగుందకు, హాలహర్వి ఎస్‌ఐ నాగేంద్రను ఆదోని త్రీటౌన్‌కు బదిలీ చేశారు. చిప్పగిరి ఎస్‌ఐ రమేష్‌బాబును మద్దికెరకు అక్కడ పనిచేస్తున్న ఎస్. మహ్మద్ రిజ్వాన్‌ను చిప్పగిరికి బదిలీ చేశారు. ఇక నంద్యాల వీఆర్‌లో ఉన్న ఎం.నగేష్, నరేంద్రలను ఉలిందకొండ, హాలహర్వి పోలీస్ స్టేషన్లకు బదిలీ చేశారు.





ఇది 'చెత్త' ప్రభుత్వం

- చెత్తపైనా పన్ను వేశారు
- ఒక్క పరిశ్రమను కూడా తేలేకపోయారు
- టీడీపీ హయాంలోనే ప్రాజెక్టులకు పెద్దపీట
- రా.. కదలిరా సభలో టీడీపీ అధినేత చంద్రబాబు

కర్నూలు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి)/పత్తికొండ: 'చెత్తపైన కూడా చెత్త వేసిన చెత్త ప్రభుత్వమిది.. ఒక్క పరిశ్రమను కూడా తేలేకపోయిన అసమర్థ పాలన జగన్‌ది. ప్రాజెక్టులకు పెద్దపీట వేసింది టీడీపీ హయాంలోనే' అని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. పత్తికొండలో ఆదివారం జరిగిన రా.. కదలిరా బహిరంగ సభలో ఆయన ఉత్సాహంగా ప్రసంగించారు. గత టీడీపీ ప్రభుత్వంలో గుండ్రేవుల, ఆర్డీఎస్, వేదవతి ప్రాజెక్టులకు రూ.8వేల కోట్లకు పైగా నిధులు కేటాయించామని అన్నారు. జగన్ వచ్చాక ఒక్క ప్రాజెక్టునైనా కట్టాడా అంటూ నిలదీశారు. మాజీ డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి పత్తికొండను సస్యశ్యామలం చేయాలని పట్టుబట్టి హంద్రీనీవా నుంచి 68 చెరువులకు నీరు అందించేందుకు రూ.250 కోట్లు మంజూరు చేయించుకున్నారని గుర్తు చేశారు. 75 శాతానికి పైగా పనులు పూర్తి చేశామని, ఓర్వకల్లు ఎయిర్‌పోర్టు నిర్మించామని, 33వేల ఎకరాలతో పారిశ్రామిక హబ్ ఏర్పాటు చేశామని, సోలార్, విండ్ ఎనర్జీ ప్రాజెక్టులు తీసుకువచ్చామని, సిమెంటు పరిశ్రమలు తెచ్చామని తెలిపారు. ఈ జగన్ వచ్చి ఏం చేశాడంటూ నిలదీశారు. ప్రజల ఆశీర్వాదంతో తెలుగుదేశం, జనసేన ప్రభుత్వం ఏర్పడబోతోందని, అసంపూర్తి ప్రాజెక్టులు పూర్తి చేయడమే కాకుండా గోదావరి జలాలు తెచ్చి రాయలసీమను సస్యశ్యామలం చేస్తామని చంద్రబాబు భరోసా ఇచ్చారు.

14 మంది ఎమ్మెల్యేలను ఇస్తే ఏం చేశారు..?

ఉమ్మడి జిల్లా నుంచి ఇద్దరు ఎంపీలు, 14 మంది ఎమ్మెల్యేలను గెలిపిస్తే సీఎం జగన్ ఒక్క ప్రాజెక్టునైనా కట్టారా.. ఒక్క పరిశ్రమనైనా తెచ్చాడా అని నిలదీశారు. యువతకు ఒక్క ఉద్యోగమైనా ఇచ్చాడా అని ప్రశ్నించడంతో జనం లేదు.. లేదు అంటూ కేరింతలు పెట్టారు. జాబు రావాలంటే.. బాబు రావాలంటూ జనం ఉత్సాహంతో నినదించారు. జగన్‌ను ఇంటికి పంపేందుకు సిద్ధంగా ఉన్నారా.. అవును అంటూ గట్టిగా కేరింతలు కొట్టారు. 'మీ ఉత్సాహం చూస్తుంటే.. రాబోయే ఎన్నికల్లో కర్నూలు జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో మనమే గెలుస్తామని, అందులో ఏ మాత్రం సందేహం లేదని'

ఓట్ల దొంగలున్నారు.. జాగ్రత్త

గెలుస్తామన్న ధీమా ఉండాలిగాని నిర్లక్ష్యం వద్దని చంద్రబాబు అన్నారు. ఓట్ల దొంగలున్నారని, ఆన్‌లైన్‌లోనే మార్చేస్తున్నారని. జాగ్రత్తగా ఉండాలంటూ కార్యకర్తలకు అధినేత సూచించారు. ఈ 73 రోజులు అప్రమత్తంగా ఉంటూ.. ప్రతిరోజూ ఓటు ఉందో లేదో తనిఖీ చేసుకుందామని చంద్రబాబు సూచించారు. ఉద్యోగాల కోసం.. డ్రిప్ ఇరిగేషన్ కోసం.. సైకో జగన్ పాలన అంతం కోసం, బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం అంటూ చంద్రబాబు ప్రసంగిస్తుంటే రా.. కదిలిరా అంటూ జనం పెద్ద ఎత్తున దిక్కులు పెక్కటిల్లలా నినదించారు. రాతియుగం పోవాలి.. స్వర్ణ యుగం రావాలని చంద్రబాబు అంటే.. జగన్ పోవాలి.. టీడీపీ ప్రభుత్వం రావాలంటూ జనం కేరింతలు కొట్టారు.

అన్నారు. మరో పక్క పెరుగుతున్న నిత్యావసర ధరలు, పెంచిన కరెంటు చార్జీలు, ఆర్టీసీ చార్జీలపై ఏకరువు పెట్టారు. చెత్తపై కూడా పన్నులు వేసిన చెత్త ప్రభుత్వమంటూ దుయ్యబట్టారు. ఈ సభలో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఎన్ఎండీ ఫరూక్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు, మాజీ డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, టీడీపీ జోన్-5 కోఆర్డినేటర్ బీద రవిచంద్రయాదవ్, మాజీ మంత్రి భూమా అఖిలప్రియ, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గోగిశెట్టి నరసింహారావు, మాజీ మంత్రి కేఈ ప్రభాకర్, ఆయా నియోజకవర్గం ఇన్‌చార్జిలు కేఈ శ్యాంబాబు, టీజీ భరత్, కోట్ల సుజాతమ్మ, కే.మీనాక్షినాయుడు, పి.తిక్కారెడ్డి, బీవీ జయనాగేశ్వరరెడ్డి, ఆకెపోగు ప్రభాకర్, పాణ్యం ఇన్‌చార్జి గౌరు చరిత, నందికొట్కూరు ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జిలు రేఖాగౌడు, మల్లప్ప, సురేష్ తదితరులు ప్రసంగించారు. సమావేశంలో టీడీపీ నాయకులు బి.వీరభద్రగౌడు, వైకుంఠం మల్లికార్జున, పాలకుర్తి శ్రీనివాసరెడ్డి, వైకుంఠం జ్యోతి, గుడిసె క్రిష్ణమ్మ, భాస్కర్ రెడ్డి, తెలుగు మహిళా అధ్యక్ష కార్యదర్శులు ముంతాజ్ భేగం, సుకన్యాదేవి, చంద్రదండు అధ్యక్షుడు ప్రకాష్ నాయుడు, మీడియా కోఆర్డినేటర్ బీవీ వెంకట్రాముడు తదితరులు పాల్గొన్నారు.



చంద్రబాబును కలిసిన కార్పొరేటర్ కైప పద్మలతారెడ్డి



వేదికపై టీడీపీ నాయకులు



చంద్రబాబు రాక కోసం ఎదురు చూస్తున్న మాజీ డిప్యూటీ సీఎం కేఈ క్రిష్ణమూర్తి



చంద్రబాబుకు గొర్రెపిల్ల బహూకరణ

పత్తికొండను ఎంతో అభివృద్ధి చేశాం : కేఈ కృష్ణమూర్తి

టీడీపీ ప్రభుత్వ హయాంలో పత్తికొండను తాము ఎంతో అభివృద్ధి చేశాం. మరో రెండు నెలల్లో వైసీపీ అరాచక పాలనకు అంతం తప్పదు. నాలుగున్నరేళ్ల పాలనలో అవినీతి అక్రమాలు తప్ప జగన్ చేసిన అభివృద్ధి అంటూ ఏమీ లేదు. సిద్ధమంటూ జగన్ ఇస్తున్న ప్రకటనలకు ప్రజలకు కూడా ఆయన్ను సాగనంపేందుకు సంసిద్ధంగా ఉన్నారు.

ప్రాజెక్టులు పూర్తి చేస్తేనే భవిష్యత్ : కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి

పెండింగ్‌లో ఉన్న వేదవతి, గుండ్రేవుల, హంద్రీనీవా, ఆర్డీఎస్ వంటి ప్రాజెక్టులను పూర్తిచేస్తేనే జిల్లాకు భవిష్యత్ ఉంటుంది. వైసీపీ ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్మాణంలో పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరించింది. ప్రాజెక్టులు పూర్తి కావాలంటే టీడీపీ ప్రభుత్వం వచ్చితీరాల్సిందే.

అవినీతి ఎమ్మెల్యేను సాగనంపుదాం : కేఈ శ్యాబాబు

అవినీతి అక్రమాలతో నియోజకవర్గాన్ని దోచుకుంటున్న పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవికి వచ్చే ఎన్నికలలో ఓటుతో బుద్ధిచెప్పి ఇంటికిసాగనంపుదాం. భూకబ్జాలు, దందాలు, ఇసుక, మద్యం మాఫియాతో అక్రమసంపాదన, ఉద్యోగాలపేరిట లంచాలు, కాంట్రాక్టర్లను బెదిరించి పర్సంటేజీలతో దోపిడీకి పాల్పడుతూ, ప్రజాసంక్షేమాన్ని అభివృద్ధిని ఎమ్మెల్యే మరిచారు.

చావుకెళ్లినా నవ్వడమేంటి?: కోట్ల సుజాతమ్మ

ఎవరైనా మృతులకు నివాళులర్పించేందుకు వెళ్తే బాధపడటం సహజం. కానీ సీఎం జగన్ మాత్రం విషాద కార్యాలు, చావులకు వెళ్తే నవ్వుతుంటాడు. నవ్వుతూ నివాళులర్పించే జగన్‌ను ఏమనుకోవాలి. ప్రజల బాధను చూసి నవ్వుకుంటున్న జగన్.. చివరకు నవ్వులపాలై ఓటమిని చూడడం ఖాయం.

వైసీపీ అంతం ఖాయం : మీనాక్షినాయుడు

రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన వైసీపీ పాలన అంతానికి నేడు పత్తికొండలో జరిగిన 'రా..కదలిరా' కార్యక్రమం వేదిక నాందికావాలి. 72 ఏళ్ల వయసులో చంద్రబాబు నాయుడు చేపట్టిన ఈ కార్యక్రమంతో అధికార వైసీపీకి ఓటమి భయం పట్టుకుంది.

బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం చేసిన జగన్ : తిక్కారెడ్డి

నాఎస్సీ, నాఎస్టీ, నాబీసీ అంటూ కల్లబొల్లి కబుర్లుచెప్పే జగన్ ఆ వర్గాలకు చేసింది శూన్యం. బడుగుల కార్పొరేషన్ల ద్వారా ఒక్కరూపాయి కూడా జగన్ ప్రభుత్వం రుణాలు ఇవ్వలేదు. ఛైర్మన్లుగా మారిన వైసీపీ నేతలకు జీతాలు ఇచ్చేందుకు తప్ప బీసీ కార్పొరేషన్లు ఎందకూ పనిచేయడం లేదు.

వైసీపీకి రోజులు దగ్గర పడ్డాయి : కేఈ ప్రభాకర్

అధికారం చేపట్టిన జగన్ అవినీతి అక్రమాలతో రాష్ట్రాన్ని అప్పుల కుప్పలుగా మార్చిన వైసీపీకి రోజులు దగ్గర పడ్డాయి. వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పి వైసీపీని గద్దె దించడం ఖాయం.

అభివృద్ధి మరచిన జగన్ : ఆకెపోగు ప్రభాకర్

రాష్ట్రంలో అభివృద్ధిని సీఎం జగన్ మరిచాడు. అందుకే సిద్ధం అంటూ కొత్తగా పోస్టర్లతో నినాదం అందుకున్నాడు. ఆయన దృష్టిలో సిద్ధం అంటే జైలుకు వెళ్లడం ఏమో.

వైనాట్ 175 ఏమైంది : జయనాగేశ్వరరెడ్డి

వైనాట్ 175 అంటూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బీరాలు పలికాడు. 2024 ఎన్నికలు వచ్చేలోగా దేవుడు రాసిన స్క్రిప్టు జరుగుతుందని చెప్పాడు. ఇప్పుడు ఆ మాటలు ఏమైనట్లు జగన్. అవినీతి అక్రమాలకు ఏదో రోజు చరమగీతం పలకడం ఖాయం. జగన్ ప్రభుత్వానికి ఇక రోజుగులు గడిచిపోయాయి.

సమనయ్వంతో సాగితే విజయం మనదే

-సురేష్, జనసేన జిల్లా కన్వీనర్

వైసీపీ ఆరాచాకాలను అరికట్టేందుకు టీడీపీ, జనసేన పొత్తుతో ముందుకు సాగుతున్నాం. సమన్వయంతో ముందుకు సాగితే వచ్చే ఎన్నికల్లో విజయం మనదే. రాష్ట్ర వ్యాప్తంగా చంద్రబాబునాయుడు చేపట్టిన 'రా..కదలి రా' కార్యక్రమం వైసీపీకి వెన్నులో వణుకుపుట్టిస్తోంది. వచ్చే ఎన్నికల్లో వైసీపీని ఓడించి టీడీపీ, జనసేన అధికారం చేపట్టేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలి.

ఎన్నికలపై మూడు రోజులపాటు శిక్షణ

కర్నూలు(న్యూసిటీ), జనవరి 28: రాబోవు సాధారణ ఎన్నికలను పురస్కరించుకుని ఈ నెల 30, 31, ఫిబ్రవరి 1న మూడు రోజుల పాటు ఎన్నికలపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ డా.జి.సృజన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 30న జిల్లా పరిషత్ ఆవరణలోని డీపీఆర్సీ భవనంలో జిల్లాలో ఎనిమిది నియోజవర్గాలకు సంబంధించి ఎంపిక చేసిన లెవెల్ మాస్టర్స్‌కు ఐటీ అప్లికేషన్స్‌పై శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్ర 5 గంటల వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు. 31న డీపీఆర్సీలో ఎంపిక చేసిన లెవెల్ మాస్టర్స్‌కు పోలింగ్ సరళిపై, ఫిబ్రవరి 1న బ్యాలెట్ సరళిపై ఇక్కడే శిక్షణ ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్స్‌గా డ్వామీ పీడీ సలీంబాషా, బీసీ వెల్ఫేర్ అధికారి వెంకటలక్ష్మీ, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి పి.దీప్తి, డ్వామీ ఏపీడీ జి.అలీపీరా, నిక్ అధికారి సి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మైనింగ్‌శాఖ డీడీ రాజశేఖర్ వ్యవహరించనున్నారు.

విద్యతోపాటు దేశభక్తిని అలవర్చుకోవాలి

శ్రీకృష్ణదేవరాయ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ తులసి రామచంద్ర ప్రభు



శ్రీకృష్ణ దేవరాయల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తులసి రామచంద్ర ప్రభు తదితరులు

కర్నూలు(కల్చరల్), జనవరి 28: విద్యార్థులు చదువుతోపాటూ దేశభక్తిని కూడా అలవర్చుకోవాలని శ్రీకృష్ణదేవరాయ చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ తులసి రామచంద్ర ప్రభు అన్నారు. ఆదివారం నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో రాయల్ అఫిషియల్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (రోపా) ఆధ్వర్యంలో బలిజకుల మెరిట్ విద్యార్థులకు ఉపకారవేతనాల పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తులసి రామచంద్ర ప్రభు హాజరై శ్రీకృష్ణదేవరాయల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువులో రాణిస్తున్న విద్యార్థులకు 20 ఏళ్లుగా ఉపకార వేతనాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో రూ.21 కోట్లు నిధులు తమ శ్రీకృష్ణదేవరాయ చారిటబుల్ ట్రస్టు నుంచి అందించామన్నారు. ప్రతి ఒక్కరూ జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకున్న తరువాత సేవా గుణంతో మరొకరికి సాయం అందించాలని పిలుపునిచ్చారు. అనంతరం 123 మంది మెరిట్ బలిజ కుల విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రోపా సభ్యులు, బలిజ సంఘం నాయకులు శెట్టి విజయకుమార్, కోనేటి చంద్రబాబు, కోనేటి వెంకటేశ్వర్లు, డాక్టర్ వై. సత్యనారాయణ, డాక్టర్ కుల్లాయప్ప, పత్తి ఓబులయ్య, డాక్టర్ కొట్టే చెన్నయ్య, రాజారామ్, దంతల రమణ, జి.శ్రీనివాస్, మల్లికార్జున మూర్తి తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.25 లక్షల విరాళం



ఆలయ ఈఓకు విరాళం చెక్కును అందజేస్తున్న దాత

శ్రీశైలం, జనవరి 28: శ్రీశైలం దేవస్థానం భక్తులకు నిర్వహిస్తున్న నిత్య అన్నప్రసాద వితరణ పథకానికి ఆదివారం సికింద్రాబాద్ రాణి కన్‌స్ట్రక్షన్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థకు చెందిన గల్లా గుండయ్య అనే భక్తుడు రూ.25లక్షల విరాళాన్ని ఆలయ కార్యనిర్వహణాధికారి డి. పెద్దిరాజుకు అందజేశారు. దాతలకు దేవస్థానం అధికారులు స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ జి.వెంకటేష్, ప్రజాసంబంధాల అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

షర్మిల రాకతో కాంగ్రెస్‌లో జోష్



కర్నూలు(అర్బన్), జనవరి 28: షర్మిల రాకతో కాంగ్రెస్‌లో జోష్ పెరిగింది. వైసీపీలో అసంతృప్తులు చెలరేగుతున్న సమయాన రాష్ట్రంలో కాంగ్రెస్ తన స్థానాన్ని సుస్థిరం చేసుకోవడానికి ఇదే సరైన సమయమని భావిస్తోంది. ఈ క్రమంలో ఉమ్మడి నంద్యాల, కర్నూలు జిల్లాలకు సంబంధించిన ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సోమ వారం విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నారు. ఇందుకు తనిష్క ఫంక్షన్ హాలులో సమావేశం నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ సమావేశాన్ని కేంద్రంగా చేసుకొని కర్నూలు జిల్లాలో వైసీపీ అసంతృప్తులకు గాలం వేసి దిశగా అధిష్టానం కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఇటీవల వైసీపీలో సీట్ల సర్దుబాటు ప్రక్రియలో తనకు ప్రాధాన్యత లేకపోవడంతో ఓ మంత్రి అజ్ఞాతంలోకి వెళ్లారని, కర్ణాటక వేదికగా కాంగ్రెస్ పెద్దలతో మంత నాలు జరుపుతున్నారనే ప్రచారం జిల్లాలో జోరుగా సాగుతోంది. మరి కొందరు వైసీపీ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నామంటూ ప్రచారం చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో షర్మిల సమావేశం చర్చనీయాంశమైంది. ప్రచారానికి తగ్గట్టుగానే ఎందరో సిద్ధంగా ఉన్నారని ఫిబ్రవరి రెండో వారంలో పార్టీలో కీలక నాయ కులు చేరబోతున్నారంటూ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్‌వలి చెప్పడం చర్చనీయాంశమైంది.

నేడు నంద్యాల, కర్నూలు శ్రేణులతో సమావేశం

సమావేశం సాగబోతోంది ఇలా..

రెండు జిల్లాల్లో పార్టీ స్థితిగతులను తెలుసుకోవడంతోపాటు పార్టీ పునర్నిర్మాణానికి సంబంధించిన దిశానిర్దేశం చేస్తారు. సమావేశంలో ఆమెతో పాటు రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్యాల రావు ఠాగూర్, పీసీసీ మాజీ అధ్యక్షులు, సీడబ్ల్యూసీ సభ్యుడు రఘు వీరారెడ్డి, గిడుగు రుద్రరాజు, ముఖ్య నేతలు తులసీరెడ్డి, మస్తాన్‌వలి, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు నాగమధుయాదవ్ తదితరులు పాల్గొంటారు. షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరి, పీసీసీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా కర్నూలుకు వస్తున్న నేపథ్యంలో వీలైనంత మంది కార్యకర్తలను సమావేశానికి రప్పించాలని నేతలు యత్నిస్తున్నారు. ఇందులో భాగంగా రెండు జిల్లాల పరిధిలో కార్యకర్తలు, పార్టీ అభిమానులను గుర్తించి వ్యక్తిగతంగా ఆహ్వానం పంపినట్లు సమాచారం. మధ్యాహ్నం నంద్యాల చెక్ పోస్టు నుంచి బీ క్యాంప్, రాజ్‌విహార్, ఆనంద్ టాకీస్, ఇందిరాగాంధీ నగర్, సీతారాం నగర్, వెంకట రమణ కాలనీ మీదుగా తనిష్క ఫంక్షన్ హాలు వరకు ర్యాలీగా చేరుకొని అక్కడ సమావేశం అవుతారు.

ప్రజా కోర్టులో జగన్‌రెడ్డికి శిక్ష తప్పదు



కల్లూరు, జనవరి 28: రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న సీఎం జగన్‌రెడ్డికి ప్రజా కోర్టులో శిక్ష తప్పదని పాణ్యం టీడీపీ ఇన్‌చార్జ్ గౌరుచరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జ్ గౌరు వెంకటరెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం తమ నివాసంలో వారు విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైందన్నారు. జగన్ ప్రభుత్వానికి మిగిలింది 74 రోజులు మాత్రమే అన్నారు. ఎన్నికల అనంతరం టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రానుందని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికలకు సిద్ధం అంటున్న జగన్‌రెడ్డిని ఓడించేందుకు రాష్ట్ర ప్రజలు కూడా సిద్ధంగా ఉన్నారన్నారు. వైసీపీ బాధితులే టీడీపీకి స్టార్ క్యాంపెయినర్లు అని, ఇసుక కొరతతో రోడ్డున పడ్డ కార్మికరంగం కూలీలే టీడీపీకి స్టార్ క్యాంపెయినర్లు అన్నారు. టీడీపీ, జనసేన నాయకులు కార్యకర్తలు కష్టపడి జగన్‌ను ఇంటికి సాగనంపాలని వారు పిలుపునిచ్చారు.

గౌరు చరిత, గౌరు వెంకటరెడ్డి

అశోక్‌నగర్‌లో చైన్ స్నాచింగ్

కర్నూలు, జనవరి 28: నగరంలోని అశోక్‌నగర్‌లో ఆదివారం రాత్రి చైన్ స్నాచింగ్ జరిగింది. పద్మావతి అనే వృద్ధురాలి మెడ నుంచి గుర్తు తెలియని దుండగులు బంగారు గొలుసును లాక్కెళ్లారు. అశోక్‌నగర్‌కు చెందిన పద్మావతి తన ఇంటి ఎదుట నడుచుకుంటూ వెళ్తుండగా పల్సర్ బైక్‌పై ఇద్దరు యువకులు వచ్చారు. కాస్త దూరంలో బైక్‌ను ఆపి ఓ యువకుడు పద్మావతి వద్దకు వచ్చి రెసిడెన్షియల్ స్కూల్ ఎక్కడా? అంటూ అడిగాడు. తనకు తెలియదని సమాధానం ఇచ్చి వెళ్తుండగా ఆమె మెడలో నుంచి గొలుసును ఆ యువకుడు లాక్కెళ్లాడు. అప్పటికే సిద్ధంగా ఉన్న పల్సర్ బైక్ ఎక్కి పరారయ్యాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సీసీ కెమెరాలను పరిశీలించారు. అపహరణకు గురైన గొలుసు విలువ ఐదు తులాలు ఉంటుందని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇంటర్మీడియట్ పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 28: ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పబ్లిక్ పరీక్షల ఫీజు గడువును ఈ నెల 29న సోమవారం వరకు పొడిగించినట్లు ఆర్ఐవో ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టి ఆదివారం తెలిపారు. తాత్కా లిక ఫీజు రూ.550, అపరాధ రుసుం రూ.3వేలతో కలిపి సోమవారం సాయం త్రం 5 గంటల్లోగా ఆన్‌లైన్‌లో చెల్లించాలన్నారు. ఇంకా పరీక్ష ఫీజు చెల్లించ కుండా మిగిలివున్న విద్యార్థులకు సమాచారం ఇవ్వాలని కళాశాల ప్రిన్సిపాళ్లను ఆర్ఐవో ఆదేశించారు.

కొత్త సీఐలకు జిల్లాలు కేటాయింపు

కర్నూలు, జనవరి 28: ఇటీవలే సీఐలుగా పదోన్నతి పొందిన 47 మంది సీఐలకు జిల్లాలు కేటాయించారు. కర్నూలు జిల్లాకు 8 మందిని, నంద్యాల జిల్లాకు ఐదుగురిని, కడప జిల్లాకు 9 మందిని, అనంతపురం జిల్లాకు 15 మందిని, అన్నమయ్య జిల్లాకు మరో ఐదుగురిని కేటాయించారు. కాగా మిగిలిన వారికి ఇంకా జిల్లాలు కేటాయించలేదు.

అనుచిత పోస్టులు పెట్టిన మైనర్ అరెస్టు

కర్నూలు, జనవరి 28: ఇటీవల సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టిన ఓ మైనర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. పది రోజుల కింద పాతబస్తీకి చెందిన మైనర్ సోషల్ మీడియాలో అనుచిత పోస్టు చేశారు. ఇది వైరల్‌గా మారడంతో అప్రమత్తమైన పోలీసులు అతడిని జువైనల్ హోమ్‌కు తరలించారు.

జీర్ణోద్ధరణ పనులను వేగవంతం చేయండి



రామాలయ జీర్ణోద్ధరణపై చర్చిస్తున్న ఎమ్మెల్యే శిల్పా

ఆత్మకూరు, జనవరి 28: ఆత్మకూరు పట్టణంలోని అతి పురాతన శ్రీకోదండ రామాలయ జీర్ణోద్ధరణ పనులను వేగవంతంగా చేపట్టాలని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి దేవాదాయశాఖ అధికారులను ఆదేశించారు. ఆదివారం స్థానిక వైసీపీ కార్యాలయంలో దేవాదాయశాఖ, హిందూ ధార్మిక సంఘాల నాయకులతో కలిసి సమీక్షించారు. అలాగే జీర్ణోద్ధరణ నిర్మాణ మ్యాప్‌ను పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోదండ రామాలయ పనులను వేగవంతంగా చేయాలని సూచించారు. సమావేశంలో పువ్వాడి భాస్కర్, గరుడాద్రి సుదర్శన్, వాసుదేవరెడ్డి, శివరామకృష్ణ, వెంకటరమణ పాల్గొన్నారు.

నాటు సారా బట్టీ ధ్వంసం

ఆత్మకూరు రూరల్, జనవరి 28: ఆత్మకూరు మండలం సిద్ధాపురం గ్రామ శివార్లలోని నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు సీఐ నాగభూషణ్, ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు. ఆదివారం ఎస్‌తో పాటు పోలీస్ సిబ్బంది సిద్ధాపురం గ్రామ శివార్లలోని అటవీ ప్రాంతంలో సోదాలు చేపట్టారు. ఈ దాడుల్లో భాగంగా గ్రామ శివార్లలోని అటవీ ప్రాంతంలో ఓ నాటుసారా స్థావరాన్ని గుర్తించి ఆ బట్టీ వద్ద 14 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని, అక్కడ ప్లాస్టిక్ డ్రమ్ములలో ఉన్న 800 లీటర్ల బెల్లపు ఊటను, నాటుసారా తయారీ సామగ్రిని ధ్వంసం చేసినట్లు సీఐ తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఒత్తిడికి గురి కావొద్దు



విద్యార్థులకు ప్రేరణ శిక్షణ ఇస్తున్న రీసోర్స్ పర్సన్

ఆత్మకూరు, జనవరి 28: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికావద్దని జిల్లా బీసీ సంక్షేమ, సాధికారత అధికారి లక్ష్మీదేవి అన్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆత్మకూరు, నందికొట్కూరు, పగిడ్యాల, బండిఆత్మకూరు, కొత్తపల్లి బీసీ వసతి గృహాల్లో ఆశ్రయం పొందుతున్న పదో తరగతి విద్యార్థులకు రానున్న పది పబ్లిక్ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని ప్రేరణా శిక్షణా కార్యక్రమాలను నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. పది పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనవకుండా నిర్దేశించిన పరీక్షా సమయాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ప్రత్యేకించి ప్రశ్నపత్రంలో తమకు తెలిసిన వాటికి ఆలస్యం చేయకుండా జవాబులు రాయాలని చెప్పారు. స్క్వాడ్ వచ్చిన సందర్భంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. అనంతరం ఆయా సబ్జెక్టుల రిసోర్స్ పర్సన్లు పలు మెలకువలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్లు ప్రశాంత్‌రాజు, విజయలక్ష్మి, దామరేకుల రవి, వసతి గృహాల సంరక్షకులు పాల్గొన్నారు.

ఐలమ్మ విగ్రహావిష్కరణ



ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆర్థర్

జూపాడుబంగ్లా, జనవరి 28: తెలంగాణ సాయుధ పోరాట మొట్టమొదటి వీరవనిత చాకలి చిట్యాల ఐలమ్మ విగ్రహాన్ని జూపాడుబంగ్లాలో ఎమ్మెల్యే ఆర్థర్ ఆవిష్కరించారు. ఆమె పేదల అభ్యున్నతి కోసం ఎన్నో త్యాగాలు చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమానికి ఐలమ్మ మనవడు రామచంద్ర హాజరయ్యారు. కార్యక్రమానికి సర్పంచ్ బాలయ్య, ఎంపీటీసీలు వెంకటమ్మ, కృపాకర్, అంబేడ్కర్ యువజనసంఘం నాయకులు ఎర్రన్న, రజకసంఘం నాయకులు మౌలాలి, గురుస్వామి, రామాంజనేయులు, వైసీపీ నాయకులు జంగాలపెద్దన్న, కిరణ్‌కుమార్‌రెడ్డి, ధర్మారెడ్డి, దేవసహాయం, శివానందరెడ్డి, ఉస్మాన్‌బాషా పాల్గొన్నారు.

31న కలెక్టరేట్ ఎదుట ధర్నా




మున్సిపల్ ఉర్దూ పాఠశాలలో కరపత్రాలను విడుదల చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

నంద్యాల (నూనెపల్లె), జనవరి 28: మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలపై ఏపీటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 31వ తేదీ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామచంద్రారెడ్డి, శివయ్యలు తెలిపారు. ఆదివారం నంద్యాలలోని ముల్లాన్‌పేటలో ఉన్న మున్సిపల్ ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో కార్యక్రమం జరిగింది. కలెక్టరేట్ ఎదుట చేపట్టనున్న ధర్నా కరపత్రాలను నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మునిసిపల్ పాఠశాలలు, అందులో పనిచేసే ఉపాధ్యాయుల పరిస్థితి త్రిశంకు స్వర్గంలా ఉందన్నారు. బ్రిటీష్ కాలంలోనే ఏర్పడిన మున్సిపాల్టీలు స్వాతంత్ర్యానంతరం రాజ్యాంగ చట్టబద్ధత పొందిన మున్సిపల్ పాఠశాలలు, ఉపాధ్యాయులు ఇప్పటికీ ఇబ్బందులు ఎదుర్కొంటునే ఉన్నారన్నారు. ప్రభుత్వం మున్సిపల్ పాఠశాలల పట్ల నిర్లక్ష్య వైఖరి వీడి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్ రూపొందించి ప్రమోషన్లు, బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఏపీపీఎస్సీ పరీక్షకు హాజరయ్యేందుకు ఇతర ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉపాధ్యాయుల మాదిరిగా సడలింపు ఇవ్వాలని, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, మున్సిపల్, కార్పొరేషన్లకు ఎంఈవో, డిప్యూటీ ఈవో పోస్టులు మంజూరు చేయాలన్నారు. ధర్నాకు ఉపాధ్యాయులు అధికసంఖ్యలో రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ భాస్కర్‌రెడ్డి, జిల్లా గౌరవాధ్యక్షుడు రంగనాయకులు, నౌమాన్, దస్తగిరి, మధు తదితరులు పాల్గొన్నారు.

పోటెత్తిన భక్తులు

మంత్రాలయం, జనవరి 28: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం భక్తులు పోటెత్తారు. ఆదివారం సెలవు దినం కావటంతో దక్షణాది రాష్ట్రాలనుంచి వేలాదిమంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. మహాముఖద్వారం, ప్రధాన రహదారులు రాఘవేంద్ర సర్కిల్, నదితీరం భక్తులతో కోలాహలంగా మారింది. నదిలో పుణ్య స్నానాలు ఆచరించి గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

శనగకు బెట్ట బెడద



- వర్షాభావ పరిస్థితులతో దిగుబడిపై ప్రభావం
- వర్షాభావంతో పొంచి ఉన్న తెగుళ్ల ముప్పు..
- నివారణ చర్యలు చేపట్టాలంటున్న శాస్త్రవేత్తలు
- ఉమ్మడి జిల్లాల్లో దాదాపు 50 వేల హెక్టార్లలో సాగు



పంటకు తెగులు సోకిన దృశ్యం



బెట్టతో ఎండిపోయిన శనగ పంట

నంద్యాల టౌన్, జనవరి 28: వర్షాభావ పరిస్థితుల కారణంగా పప్పు శనగ పంటకు బెట్ట బారిన పడింది. దీంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ద్వారా విడుదల కాబడిన విస్తృత సాగులో ఎన్‌బీఈజీ -452, ఎన్‌బీఈజీ -119, ఎన్‌బీఈజీ -776, ఎన్‌బీఈజీ -810తోపాటు జేజే -11 రకాలను రైతులు సాగు చేశారు. కర్నూలు, ప్రకాశం, అనంతపురం, గుంటూరు, పల్నాడు, బాపట్ల, తదితర ప్రాంతాలలో శనగను ఎక్కువగా పండిస్తారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో దాదాపు 50 వేల హెక్టార్లల్లో రబీ సీజన్‌లో గత ఏడాది నవంబరు, డిసెంబరు నెలల్లో శనగను రైతులు సాగు చేశారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో కొన్నిచోట్ల శనగ పంట కోత దశకు వచ్చింది. మరికొన్ని చోట్ల పూత దశ నుంచి కాయ గట్టిపడే దశలో ఉంది.

రైతుల్లో ఆందోళన:

రబీ సీజన్‌లో గత ఏడాది నవంబరు, డిసెంబరు నెలల్లో సాగు చేసిన శనగ పంటను వర్షాభావ పరిస్థితులు వెంటాడాయి. దీంతో పంట బెట్టపోయి దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం కనిపిస్తోంది. అయితే రైతులు రెండు తడుల నీటిని పంటకు పెట్టుకుంటే బెట్టను తట్టుకోవచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. బెట్టను గుర్తించిన పొలాల్లో 19-19-19 ఎరువును ఒక కేజీ ప్రకారం ఎకరాకు వేయాలని, కేఎన్‌వో -3 మందును రెండు శాతం పిచికారి చేస్తే బెట్ట అదుపులోకి వస్తుందని సూచిస్తున్నారు.

పొంచి ఉన్న తెగుళ్ల ముప్పు:

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సాగులో ఉన్న శనగ పంటకు ప్రస్తుతం శనగ పచ్చ పురుగు ఆశించినట్లు ఇప్పటికే శాస్త్రవేత్తలు గుర్తించారు. మరికొన్ని చోట్ల తుప్పు తెగులు ఆశించే అవకాశం ఉన్నట్లు గుర్తించి రైతులు అప్రమత్తంగా ఉండి పురుగుల మందులను పిచికారీ చేయాల్సి ఉంది. ఈ తెగుళ్ల నివారణకు ఎక్సాకొనజోల్ 2 ఎంఎల్ ఒక లీటర్ నీటికి, ప్రొపకొనజోల్ ఒక ఎంఎల్ ఒక లీటర్ నీటికి కలిపి 15 రోజులకు ఒక్కసారి రెండు సార్లు పిచికారీ చేయాలని. శనగ పచ్చ పురుగు నివారణకు క్లోరాంట్రినిలిప్రోల్ 0.3 ఎంఎల్ ఒక లీటర్ నీటికి, ఫ్లూబెండమైడ్ 0.25 ఎంఎల్ లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలని శాస్త్రవేత్తలు సూచించారు.



క్షేత్రస్థాయిలో పంటను పరిశీలిస్తున్న ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు

పురుగు మందు, తెగుళ్ల మందు కలిపి పిచికారి చేయాలి

శనగ పంటకు ఆశించిన పురుగుల నివారణకు రైతులు సాధారణంగా పురుగుల మందు పిచికారి చేస్తామని, దీంతో పాటు తెగుళ్ల నివారణకు కూడా కలిపి మందు పిచికారి చేస్తే సత్ఫలితం ఉంటుందని నంద్యాల ఆర్ఏఆర్ఎస్ శనగ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వి.జయలక్ష్మి, కీటక శాస్త్ర ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జె.మంజునాథ్ వెల్లడించారు. బెట్ట నివారణకు, తెగుళ్ల నివారణకు రైతులు అప్రమత్తంగా ఉండి చుట్టూ ఉన్న వనరులను వినియోగించుకొని నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు.

జగన్‌కు కౌంట్ డౌన్ మొదలైంది



మాండ్ర సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు



లింగాపురంలో బీసీలతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు



మాట్లాడుతున్న బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గోవింద నాయుడు

నందికొట్కూరు రూరల్ జనవరి 28 : జగన్‌కు కౌంట్‌డౌన్ మొదలైందని నంద్యాల పార్లమెంట్ టీడీపీ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి అన్నారు. ఆదివారం నందికొట్కూరు మండలంలోని అల్లూరు గ్రామంలో మాండ్ర నివాసంలోని నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని పట్టిపీడించిన జగన్‌ను ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఇక మిగిలింది 74 రోజులే అని అన్నారు. ఒకప్పుడు రూ. 200 ఉన్న కరెంట్ బిల్లులు ఇప్పుడు 5 రెట్లు పెరిగి రూ. 1000 లకు పెంచాడన్నారు.మద్యం ధరలు కూడా 4రెట్లు, నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు.అన్నిరకాలుగా ప్రజలను దోచేశాడని అన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం వస్తేనే రాష్ట్రాభివృద్ధి ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు రాఘురామిరెడ్డి, జనార్ధన్ .జమీల్, మహేశ్వరెడ్డి, నారపురెడ్డి,బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక

మాండ్ర శివానందరెడ్డి సమక్షంలో తర్తూరు గ్రామ వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. ఆదివారం అల్లూరు గ్రామంలో మాండ్ర నివాసంలో మాండ్ర శివానందరెడ్డి సమక్షంలో జూపాడుబంగ్లా మండలంలోని తర్తూరు గ్రామ వైసీపీ నాయకులు హనుమంతరెడ్డి సమక్షంలో ఆగ్రామ వైసీపీ నాయకులు భాస్కర్, పుల్లయ్య, నాగరాజు, లక్ష్మన్న, జమ్మన్న, ఉస్మాన్ బాషా, ఏసేపు, శాలు భాష, ఇస్మాయిల్, చాలు. మహబూబ్ బాషా చేరారు. కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీలు వైసీపీకి బుద్ధి చెప్పాలి

బండిఆత్మకూరు, జనవరి 28: సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీకి బీసీలు బుద్ధి చెప్పాలని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు కంచర్ల సురేష్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి కంచర్ల చిన్న లింగారెడ్డి, మండల యూనిట్ ఇన్‌చార్జి తాటికొండ బుగ్గరాముడు కోరారు. ఆదివారం మండలంలోని జీసీపాలెం, లింగాపురం గ్రామాల్లో బీసీలతో సమావేశమయ్యారు. 1న బండిఆత్మకూరులో మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి అధ్యక్షతన జరిగే జయహో బీసీ సమావేశానికి బీసీలు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో షేక్ బాబు, హేమసుందర్‌రెడ్డి, బాషా, శ్రీనివాసులు పాల్గొన్నారు.

● మండలంలోని జీసీ పాలెం గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న దళితవాడకు చెందిన చిన్ని కృష్ణుడు, రంగస్వామిలను టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు కంచర్ల సురేష్‌రెడ్డి, పరమటూరు సొసైటీ మాజీ చైర్మన్ కంచర్ల మనోహర్ చౌదరి పరామర్శించారు. బాధితులకు ఒక్కొక్కరికీ రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలోఉపసర్పంచ్ కంచర్ల చిన్న లింగారెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

గోస్పాడు: తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నంద్యాల నియోజకవర్గ ఇన్‌చార్జీ, మాజీ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అధ్యక్షతన సోమవారం గోస్పాడులో జరిగే జయహో బీసీ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గోవింద నాయుడు అన్నారు. ఆదివారం మండలంలోని గోస్పాడు, పసురుపాడు, జిల్లెల్ల, యాళ్ళూరు, ఒంటివెలగల, తదితర గ్రామాలలో పర్యటించి బీసీలతో మాట్లాడి గోస్పాడులో జరిగే జయహో బీసీ కార్యక్రమానికి భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీలోనే బీసీలకు సముచిత స్థానం లభిస్తుందని, టీడీపీ ఆవిర్భావం నుంచి ఎన్‌టీఆర్, చంద్రబాబు బీసీలకు అన్ని రంగాలలో ప్రాధాన్యత ఇచ్చారని, బీసీలు అంతా ఏకమై టీడీపీకి మద్దతు తెలపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో దూదేకుల సాధికార జిల్లా కన్వీనర్ దస్తగిరి, వడ్డెర సాధికార జిల్లా కన్వీనర్ సుబ్బరాయుడు, ఉప్పరి సాధికార జిల్లా కన్వీనర్ సురేష్, గోస్పాడు టీడీపీ నాయకులు పల్లె విశ్వనాథ్‌రెడ్డి, మనోజ్, శ్రీనివాసయాదవ్, భూమా హుసేని, పెద్దహుసేని, ఉపసర్పంచ్ చెన్నకేశవ పాల్గొన్నారు.

జగన్‌కు ఓటమి భయం పట్టుకుంది

ఆత్మకూరు, జనవరి 28: సీఎం జగన్‌లో ఓటమి భయం వెంటాడుతోందని మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి విమర్శించారు. ఆదివారం ఆయన ఆత్మకూరులో మాట్లాడుతూ.. ప్రజలు తిరస్కరిస్తే దిగిపోయేందుకు సిద్ధమేనంటూ జగన్ చేసిన వ్యాఖ్యలను చూస్తే ఆయనలో ఓటమి భయం వెంటాడుతోందని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లో వైసీపీ అధికారంలోకి రాదన్న భయంతోనే సీఎం జగన్ అప్రజాస్వామ్య విధానాలకు కుట్రలు పన్నుతున్నారని తెలిపారు. ప్రత్యేకించి ఓటరు జాబితాలో అనేక అక్రమాలకు పాల్పడి దొంగ ఓట్లను ఎక్కించారని, ఇందుకు నిదర్శనమే ఇటీవల కలెక్టర్లు సైతం సస్పెన్షన్లకు గురైనట్లు గుర్తు చేశారు. వైసీపీ చేసిన దొంగ ఓట్ల అవకతవకల వల్లే జనవరి 5న విడుదల కావాల్సిన ఓటరు తుది జాబితా జనవరి 22వ తేదీన విడుదలైందన్నారు. తనకు ప్రజలెవరూ ఓట్లు వేయరన్న ఉద్దేశంతోనే దొంగ ఓట్లు, నకిలీ ఓట్లకు జగన్ రెడ్డి నమ్ముకునే పరిస్థితికి వచ్చాడని విమర్శించారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని వైసీపీ చేసిన అరాచకాలు, దౌర్జన్యాలు, దోపిడీలకు అంతిమఘడియలు వచ్చాయని చెప్పారు. వైసీపీ నేతలు ఎన్ని కుయుక్తులు పడినా ఆ పార్టీని ప్రజలు తరిమికొట్టడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. టీడీపీ అదినేత చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టోపై ప్రతి ఇంట్లో అవగాహన కల్పించాలన్నారు. వైసీపీ ప్రభుత్వం ప్రకటించిన మోసాలను ప్రజలకు వివరించాలన్నారు. డోన్ నియోజకవర్గంలో టీడీపీ, జనసేనలకు అందరం కలిసికట్టుగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న బుడ్డా రాజశేఖరరెడ్డి

జయహో బీసీ సదస్సును జయప్రదం చేయండి



ఆత్మకూరులో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ఆత్మకూరు, జనవరి 28: ఆత్మకూరు పట్టణంలో 3న జరిగే జయహో బీసీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి అబ్దుల్లాపురం బాష, మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి నాగూర్ ఖాన్, బీసీ విభాగం నాయకులు ఆర్టీసీ రామకృష్ణ, ఇరగదిండ్ల మురళీ, నగేష్ యాదవ్, సుబ్బరావు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని 3వ వార్డులో గల గొల్లపేటలో జయహో బీసీ సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ బీసీలను చైతన్యం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. టీడీపీతోనే బీసీల సంక్షేమ సాధ్యపడుతోందని అన్నారు. ఈసదస్సుకు శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డితో పాటు జిల్లా నాయకులు హాజరుకానున్నట్లు తెలిపారు. పట్టణంలోని వెంగళరెడ్డినగర్‌లో నిర్వహించే జయహో బీసీ సదస్సుకు బీసీలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ విభాగం టీడీపీ నాయకులు మల్లికార్జున, శ్రీను, రమణయ్య, నాగేశ్వరరావుగౌడ్, ఆంజనేయులు, నీలి శ్రీను ఉన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించాలి



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నగిరి శ్రీనివాసులు

నంద్యాల (నూనెపల్లె), జనవరి 28: సీఎం జగన్మోహన్‌రెడ్డి అధ్యక్షతన 31న జరిగే మంత్రివర్గ సమావేశంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై చర్చించి పరిష్కార ప్రతిపాదనలకు ఆమోదం తెలపాలని ఏపీటీఎఫ్-1938 రాష్ట్ర కార్యదర్శి నగిరి శ్రీనివాసులు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాధవస్వామి, సాంబశివుడు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నంద్యాలలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ సెప్టెంబర్ 2004కంటే ముందు ఉద్యోగానికి ఎన్నికై ఆ తర్వాత నియామకం కాబడిన ఉద్యోగ, ఉపాధ్యాయులందరికీ కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులు 57ను అనుసరించి పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. 2019నుంచి ఇప్పటివరకు సీపీఎస్ రద్దు, విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం చేసిన పోరాటాల సమయంలో పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని కోరారు. 12వ పే కమీషన్ ఆలస్యం అవుతున్నందున మధ్యంతర భృతి 35శాతం చెల్లించాలని మున్సిపల్, ఆదర్శ, కేజీబీవీ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించి డీఎస్సీ ద్వారా రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు మధుసూదన్‌రావు, పుల్లయ్య, జయరాం, మునిస్వామి, రవి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ నిర్వహించాలి



మాట్లాడుతున్న సుధాకర్

నంద్యాల (నూనెపల్లె), జనవరి 28: రాష్ట్రంలో 50వేలకు పైగా ఉపాధ్యాయ ఖాళీలున్నాయని 117 జీవోను రద్దుచేసి మెగా డీఎస్సీ ద్వారా ఆ పోస్టులు భర్తీ చేయాలని ఎస్టీయూఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుధాకర్, కుమార్‌లు డిమాండ్ చేశారు. ఆదివారం నంద్యాలలో ఎస్టీయూఎఫ్ జిల్లా నూతన కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర నాయకులు ముఖ్య అతిథులుగా హాజరై కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చాక మెగా డీఎస్సీని ప్రకటిస్తామని చెప్పి నాలుగున్నరేళ్లు గడుస్తున్నా నోటిఫికేషన్ ఇవ్వకపోవడం దౌర్భాగ్యమన్నారు. తరగతుల విలీనం, హేతుబద్ధీకరణ పేరుతో 15వేల ఉపాధ్యాయ పోస్టులను రద్దు చేయడం సమంజసం కాదని వ్యాఖ్యానించారు. విద్యావ్యవస్థ అభివృద్ధి కోసం ప్రభుత్వం పాటుపడకుండా నూతన సంస్కరణలు, ఏకపక్ష నిర్ణయాలతో సర్వనాశనం చేశారని మండిపడ్డారు. అశాస్త్రీయ జాతీయ విద్యావిధానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ధరణి, ఉపేంద్ర, మాతృనాయక్, రాము, కేశాలు, ప్రభాకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పల్లకి ఉత్సవం



శ్రీశైలం, జనవరి 28: శ్రీశైలంలో లోకకల్యాణార్థం ఆదివారాన్ని పురస్కరించుకొని స్వామి, అమ్మవార్లకు పల్లకి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో నిర్వహించిన ఉత్సవ కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతికి ప్రత్యేక పూజలు చేశారు.

● ఆకట్టుకున్న సాంప్రదాయ నృత్య ప్రదర్శన

శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో ఆదివారం హైదరాబాద్‌కు చెందిన నృత్య సంపద నాట్యరాజ కళానికేంద్రం బృందంచే సంప్రదాయ నృత్యప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో వినాయకకౌత్వం, శివాష్టకం, జయజయదుర, ఓం నమఃశివాయ తదిత గీతాలకు వరుణ్, శరణ్య, మృదుల, అంజలి, సహస్ర, మనోజ్ఞ, హర్షిత, ప్రసన్న, అవంతిక, మధు నృత్య ప్రదర్శనతో అలరించారు.



నృత్యం చేస్తున్న కళాకారులు

కొనసాగుతున్న పార్వేట ఉత్సవం


నరసాపురంలో పార్వేట పల్లకి మోస్తున్న భక్తులు

రుద్రవరం, జనవరి 28: మండలంలోని నరసాపురం గ్రామంలో పండుగలా పార్వేట ఉత్సవం ఆదివారం కొనసాగింది. అర్చకులు నిత్యాకల్యాణ రంగనాథన్ ఉత్సవమూర్తులైన జ్వాలా నరసింహస్వామి, ప్రహ్లాద వరదస్వామికి అలంకరణ చేసి పూజలు ప్రారంభించారు. గ్రామంలోని వివిధ తలుపుల వద్ద పార్వేట పల్లకిని కొలువుతీర్చి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు: మండలంలోని కొండమాయపల్లె, రుద్రవరం, చిన్నకంబలూరు, యల్లావత్తుల గ్రామాల్లో ఆదివారం గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ దేవతలైన పెద్దమ్మ మారెమ్మ, సుంకులమ్మ అమ్మవార్లకు మహిళలు చీరలు, బోనాలు సమర్పించారు.

సీతారాములకు విశేష పూజలు


ఆలయంలో పూజలు చేస్తున్న ఆర్యవైశ్యులు

చాగలమర్రి, జనవరి 28: చాగలమర్రి గ్రామంలోని కోదండరామ, పట్టాభిరామ, వీరాంజనేయస్వామి ఆలయాల్లో ఆదివారం లోక కల్యాణార్థం వేద పండితుల ఆధ్వర్యంలో సీతారాములకు విశేష పూజలు చేశారు. మహిళలు సామూహికంగా లలిత పారాయణం చేశారు. సీతారాముల ఉత్సవమూర్తులచే పల్లకి ఉత్సవం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యం: మంత్రి బుగ్గన


బుగ్గనను కలిసిన నాయకులు

డోన్, జనవరి 28: పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని గుత్తి రోడ్డులో రూ.37 కోట్లతో నిర్మించిన వంద పడకల ఆసుపత్రిని కలెక్టర్ డా.మనజీర్ జిలాని సామూన్, జడ్పీ ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డితో కలిసి మంత్రి బుగ్గన ప్రారంభించారు. శనివారం స్థానిక పాత బస్టాండులో రూ.18.60 కోట్లతో నిర్మించిన ఆధునిక కూరగాయల మార్కెట్‌ను రూ.4.86 కోట్లతో నిర్మించిన క్లబ్ హౌస్‌ను రూ.2.90 కోట్లతో నిర్మించిన రైల్వే స్టేషన్ రహదారిని, రామసుబ్బయ్య పార్కులో రూ.1.21 కోట్లతో నిర్మించిన స్విమ్మింగ్ పూల్‌ను ప్రారంభించారు. మంత్రి బుగ్గన మాట్లాడుతూ కర్నూలు పెద్దాసుపత్రికి దీటుగా అన్ని సౌకర్యాలతో డోన్ నియోజకవర్గంలో ప్రజలకు వంద పడకల ఆసుపత్రిని అందుబాటులోకి తెచ్చామన్నారు. కార్యక్రమంలో ఎస్పీ రఘువీర్ రెడ్డి, మీట్ కార్పొరేషన్ ఛైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ సప్తశైల రాజేష్, రాష్ట్ర ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ చిన్నకేశవయ్యగౌడు, ఆర్డీవో వెంకటరెడ్డి, తహసీల్దార్ విద్యాసాగర్, కర్నూలు, డోన్ మున్సిపల్ కమిషనర్లు భార్గవ్‌తేజ వెంకట్రామిరెడ్డి, పాల్గొన్నారు.

● **చిన్నకేశవయ్యగౌడు దంపతుల సన్మానం:** రాష్ట్ర ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ టీఈ చిన్నకేశవయ్యగౌడు, కౌన్సిలర్ టీఈ లక్ష్మి దంపతులు వంద పడకల ఆసుపత్రి ప్రారంభోత్సవ సభలో ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డిని సన్మానించారు. రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టే మెమొంటోను మంత్రి బుగ్గనకు చిన్నకేశవయ్యగౌడు దంపతులు అందజేసి శాలువాతో సన్మానించారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి


టీడీపీ మెనిఫెస్టో కరపత్రాలు అందజేస్తున్న టీడీపీ నాయకులు

చాగలమర్రి, జనవరి 28: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు, మండల బీసీ సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణగౌడ్ అన్నారు. ఆదివారం చాగలమర్రి గ్రామంలోని 214 బూత్ పరిధిలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని టీడీపీ నాయకులతో కలిసి నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలను అందజేసి మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరించారు. వైసీపీ అరాచక పాలనకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. ఐదేళ్ల పాలనలో సీఎం జగన్ ప్రజలను, రాష్ట్ర సంపదను దోచుకుని రూ.4 లక్షల కోట్లు దాచుకున్నాడని ఆరోపించారు. రాష్ట్ర అప్పు రూ.10లక్షల కోట్లు దాటినా ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితికి దిగజార్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. నియోజకవర్గ మైనార్టీ జాయింట్ సెక్రెటరీ సయ్యద్ బషీర్, టీడీపీ నాయకులు రఫిద్దిన్, అబ్దుల్లా, నరసింహ, గైబువలి, కృష్ణ, శ్యాబుల్, మహిళలు పాల్గొన్నారు.

నేడు చెర్లోపల్లిలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ

బనగానపల్లె, జనవరి 28: అవుకు మండలం చెర్లోపల్లి గ్రామంలో బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని సోమవారం సాయంత్రం 3గంటలకు నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి వ్యక్తిగత కార్యదర్శి మురళీమోహన్‌రెడ్డి ఆదివారం తెలిపారు. అవుకు మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన కోరారు. గ్రామంలో బీసీ ఇంటింటికి తిరిగి ప్రచారం గావించి బాబుష్యూరిటీ, భవిష్యత్ గ్యారెంటీ పథకాలను వివరించనున్నట్లు ఆయన తెలిపారు.

గ్రామీణులకు వైద్య సేవలందించడమే లక్ష్యం

సంజామల, జనవరి 28: గ్రామీణ పేదలకు వైద్యసేవలందించడమే లక్ష్యమని గురురాఘవేంద్ర విద్యాసంస్థల ఛైర్మన్ పెద్దిరెడ్డి దస్తగిరిరెడ్డి అన్నారు. ఆదివారం మంగపల్లెలోని పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ప్రజావైద్యశాలలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. రోగులకు నంద్యాల, కర్నూలు పట్టణాలకు చెందిన వైద్యులు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. విద్యాసంస్థల డైరక్టర్లు మౌలాలిరెడ్డి, షేక్షావలిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్‌కు స్థలం కేటాయించాలి

డోన్(రూరల్), జనవరి 28: డోన్‌లో ప్రెస్ క్లబ్ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ తాలుకా అధ్యక్షుడు వడ్డె నాగరాజు, గౌరవ సలహాదారులు శివరామచారి, కార్యదర్శి జగన్‌లు కోరారు. ఈ మేరకు ఆదివారం డోన్‌లో రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. అక్రిడేషన్‌లు ఉన్న జర్నలిస్టులతోపాటు సంస్థ గుర్తింపు కార్డులున్న జర్నలిస్టులను కూడా గుర్తించి ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ మీడియా ఫెడరేషన్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సిద్ధం కావాలి

▸ డోన్ టీడీపీ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి

డోన్, జనవరి 28: త్వరలో జరిగే ఎన్నికల యుద్ధానికి పార్టీ యంత్రాంగమంతా సిద్ధం కావాలని టీడీపీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో పట్టణ, మండల పార్టీ నాయకులకు బూత్ ఇంటిగ్రేటెడ్ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలనకు ముగింపు పలికేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. ఓటరు జాబితా వెరిఫికేషన్‌పై దృష్టి పెట్టి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టోపై ప్రతి ఇంట్లో అవగాహన కల్పించాలన్నారు. వైసీపీ ప్రభుత్వం ప్రకటించిన మోసాలను ప్రజలకు వివరించాలన్నారు. డోన్ నియోజకవర్గంలో టీడీపీ, జనసేనలకు అందరం కలిసికట్టుగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. అంతకముందు నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీకి మిగిలింది ఇక 74 రోజులేనని, ఇంటికి సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు శ్రీనివాసులు, ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గంధం శ్రీనివాసులు, మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాసులు యాదవ్, యువ నాయకులు ధర్మవరం గౌతమ్ రెడ్డి, అభిరెడ్డిపల్లె గోవిందు, జయన్న యాదవ్, మిద్దెపల్లి గోవిందు, ఎల్ఐసీ శ్రీరాములు, రామిరెడ్డి, కమలాపురం రమేష్, సిటీ కేబుల్ కిరణ్, ఆలీబాబా, నీలం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సుబ్బారెడ్డి

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

చాగలమర్రి/కోవెలకుంట్ల/ఆళ్లగడ్డ/బేతంచెర్ల, జనవరి 28: నంద్యాల జిల్లాలోని పలు మండలాల్లో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులను సన్మానించారు.

● చాగలమర్రిలోని ఆర్సీఎం ఉన్నత పాఠశాలలో 2002-2003 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. 50 మంది పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. 20 ఏళ్ల తరువాత కలుసుకున్నారు. పూర్వ విద్యార్థులు నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం మృతి చెందిన పూర్వ ఉపాధ్యాయులైన సురేష్‌వర్మ, నారాయణమ్మ, చిన్నపురెడ్డి, ప్రకాష్‌రెడ్డి, దస్తగిరికి నివాళులర్పించారు. పూర్వ ప్రధానోపాధ్యాయుడు విజయభాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు మౌలాలి, మహమ్మద్‌గౌస్, రాజ్‌కుమార్‌రెడ్డిలను సన్మానించారు.


చాగలమర్రి, కోవెలకుంట్లలో ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

● పట్టణంలోని జడ్పీ హైస్కూల్‌లో 1968-69 సంవత్సరంలో చదివిన పూర్వ విద్యార్థులు ఒక చోట కలుసుకున్నారు. అప్పుడు తమకు చదువు చెప్పిన గురువులు జీవీ సుబ్బారెడ్డి, వెలగటూరు తిమ్మారెడ్డి, సింగారెడ్డి నారాయణరెడ్డి, పెనుగొండ బాబూ సాహెబ్‌లకు ఎస్ఎస్ఎల్‌సీ గుర్తుతో ఉన్న జ్ఞాపికను అందజేసి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.


బేతంచెర్లలో..

● ఆళ్లగడ్డ పట్టణంలోని ఎద్దుల పాపమ్మ, పెద్ద మద్దిలేటిరెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, జూనియర్ కళాశాల స్థాపించిన 1956 నుంచి 2022 వరకు 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. పాఠశాల, కళాశాలలో చదువుకున్న మాజీ ఎంపీ గంగులప్రతాపరెడ్డి, ప్రభుత్వ సలహాదారుడు గంగులప్రభాకరరెడ్డి, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి. విశ్రాంత జడ్జి శివప్రసాదరావు, వైద్యులు రామగోపాల్‌రెడ్డి ఉన్నారు.

● బేతంచెర్ల పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాలలో 1994-95 విద్యాసంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఒక చోట కలిశారు. తమకు విద్యబోధించిన గురువులను ఆహ్వానించి శాలువలతో పూలమాలలతో మెమెంటులో అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు నాగభూషణం, రామశర్మ, ఆదినారాయణ, వెంకట్రావు, తిరుపాలయ్య, మల్లికార్జున ఉర్దూ హాజీ మాట్లాడారు. అనంతరం చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సబ్ ఇంజనీర్ బ్రహ్మానందరెడ్డి, జనార్దన్, వీరాంజనేయులు, శివశంకర్, రవి పాల్గొన్నారు.

ఫణీంద్ర మరెన్నో కళాకృతులు రూపొందించాలి

మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి


ఫణీంద్రకుమార్‌ను అభినందిస్తున్న బీసీ రాజారెడ్డి

బనగానపల్లె, జనవరి 28: ఇండియాబుక్ ఆఫ్ రికార్డు సాధించిన బనగానపల్లె మండలం పసుపుల గ్రామానికి చెందిన ఫణీంద్రకుమార్‌ను బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి ఆదివారం అభినందించారు. మెమొంటోను అందించి, నగదు పురస్కారం అందించారు. ఈ సందర్భంగా బీసీ రాజారెడ్డి మాట్లాడుతూ పసుపుల గ్రామానికి చెందిన ఐతా నాగరాజు, సుభాషిణి కుమారుడు ఫణీంద్రకుమార్ డిగ్రీ వరకు చదువుకొని ఖాళీ సిగరెట్ ప్యాకెట్లు, ప్లాస్టిక్ బాటిళ్లు, ప్యాబ్రిక్స్ తదితర వాటితో పలు రకాల ఆకృతులను తయారు చేసి ప్రతిభను కనబరిచారన్నారు. ఖాళీ సిగరెట్ ప్యాకెట్లతో ఒంటె ఆకృతిని తయారు చేసి ఇండియాబుక్ ఆఫ్ అవార్డు సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రిటైర్డు హెచ్‌ఎం సుధాకర్‌రెడ్డి, రిటైర్డు ఉపాధ్యాయుడు రామసుబ్బయ్య, బొబ్బల మహేశ్వర రెడ్డి, కోటా సుబ్బరాయుడు, ఏచూరి సుబ్రమణ్యం, తేళ్లపురి సుబ్బరాయుడు, విష్ణువర్ధన్‌రెడ్డి, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు సభకు తరలిన టీడీపీ నేతలు


పత్తికొండకు తరలివెళ్తున్న టీడీపీ నాయకులు

ప్యాపిలి, జనవరి 28: పత్తికొండలో జరిగిన రా..కదలిరా కార్యక్రమానికి మండలం నుంచి టీడీపీ నాయకులు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. తరలి వెళ్లిన వారిలో నాయకులు అలేబాదు పరమేష్, శ్రీనివాసులు, క్రిష్ణమోహన్, వెంకటేశ్, అలేబాదు మల్లికార్జున, జలదుర్గం నబీరసూల్, గండికోట రమేష్, గోపాల్ ఉన్నారు.

పత్తికొండ సభలో మాజీ ఎమ్మెల్యే బీసీ

బనగానపల్లె, జనవరి 28: బనగానపల్లె నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి పత్తికొండలో జరిగిన రా కదలిరా బహిరంగ సభకు ఆదివారం టీడీపీ నాయకులతో తరలి వెళ్లారు. చంద్రబాబు సభలో పాల్గొన్నారు. పత్తికొండ ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబుతో ఆయన భేటి అయ్యారు. పత్తికొండ, కర్నూలు జిల్లా రాజకీయాలపై చర్చించారు.


కేఈ శ్యాంబాబుతో భేటీ అయిన బీసీ జనార్దన్‌రెడ్డి

టీడీపీ నాయకుడి మృతికి సంతాపం

దొర్నిపాడు, జనవరి 28: మండలంలోని దొర్నిపాడు గ్రామానికి చెందిన కాకనూరు రామకృష్ణారెడ్డి (75) అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి భూమా అఖిలప్రియ, భర్త భార్గవ్‌రామ్‌నాయుడు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి రామకృష్ణారెడ్డి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. టీడీపీ కార్యకర్త మృతి బాధాకరం అన్నారు. కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని భూమా అఖిలప్రియ అన్నారు. వారి వెంట నంద్యాల జిల్లా టీడీపీ రైతు సంఘం అధ్యక్షుడు సిద్ధి సత్యం, దొర్నిపాడు మాజీ సర్పంచ్ సిద్ధి నారాయణ, అమరసాని రవి, జిల్లా సుబ్బరాయుడు, బాలఉసేని ఉన్నారు.

ప్రతి రోజూ శివస్వాములకు భిక్ష

బేతంచెర్ల, జనవరి 28: మాఘ మాసంలో శివమాల దీక్షాపరులకు బేతంచెర్ల టీడీపీ నాయకుడు నారాయణస్వామి తన సొంత ఖర్చులతో భిక్షా కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. పట్టణ శివారులో నంద్యాల రోడ్డులోని ఉన్న దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయంలో ఉంటున్న శివస్వాములకు 41 రోజులు సుమారు వంద మందికి ప్రతిరోజూ మధ్యాహ్నం భిక్ష కార్యక్రమం నిర్వహిస్తామని గురుస్వామి నారాయణస్వామి తెలిపారు. కార్యక్రమంలో గురుస్వామి, మద్దిలేటి స్వామి, శివస్వాములు పాల్గొన్నారు.

ఒత్తిడికి గురి కావొద్దు

ఆళ్లగడ్డ, జనవరి 28: పదో తరగతి విద్యార్థులు పరీక్షల సమయంలో ఒత్తిడికి గురి కాకుండా చదువుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి లక్ష్మీదేవి సూచించారు. ఆదివారం పట్టణంలోని పది పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి లోనవ్వకుండా నిర్దేశించిన పరీక్షా సమయాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ప్రత్యేకించి ప్రశ్నాపత్రంలో తమకు వచ్చిన జవాబులు ఆలస్యం రాయాలని చెప్పారు. స్క్వాడ్ టీంలు వచ్చిన సందర్భంలో కూడా ఆందోళన చెందకుండా పరీక్షలు రాసుకోవాలని సూచించారు. సంక్షేమ అధికారులు సురేష్, హరిత, మురళి, మద్దిలేటి పాల్గొన్నారు.


సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

అధ్వాన రహదారులు

▸ ఇబ్బంది పడుతున్న జనాలు
▸ పట్టించుకోని పాలకులు, అధికారులు


కొత్తపల్లె నుంచి డి.వనిపెంటకు వెళ్లే రహదారి దుస్థితి

చాగలమర్రి, జనవరి 28: మండలంలో మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో రోడ్లు మరింత అధ్వాన స్థితికి చేరుకున్నాయి. రహదారులు బురదమయంగా మారి రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తున్నాయి. కలుగొట్లపల్లె నుంచి గొట్లూరు, గొట్లూరు నుంచి నేలంపాడు, గొడిగనూరు నుంచి కొత్తపల్లె, కొత్తపల్లె నుంచి డి.వనిపెంట, డి.వనిపెంట నుంచి ముత్యాలపాడు రహదారి గుంతలమయంగా మారింది. ఈ రహదారి వెంట వాహనదారులు, గ్రామస్థులు రాకపోకలు చేసేందుకు నరకయాతన పడుతున్నారు. నాలుగేళ్లు గడుస్తున్న రహదారుల మరమ్మతులు చేపట్టకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. రాత్రి వేలలో ఆదమరిస్తే ప్రమాదాలకు గురౌతున్నారు. వర్షం కురిస్తే రాకపోకలు చేసేందుకు రహదారులు సరిగా లేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అధికారులు, పాలకులు స్పందించి రహదారుల మరమ్మతులు చేపట్టాల్సి ఉంది.

బనగానపల్లె: బనగానపల్లె పట్టణం నుంచి గుత్తి రహదారిలో రెండు కిలోమీటర్ల వరకు రోడ్డు అధ్వానంగా తయారైంది. బనగానపల్లె నుంచి యాగంటి క్షేత్రానికి, గుత్తికి, డోన్‌కు నిత్యం వందలాది వాహనాలు ఈమార్గంలో వెళ్తుంటాయి. ద్విచక్ర, ఆటోలు, ఆర్టీసీ బస్సులు, భారీ లారీలు ఈ మార్గంలో వందలాదిగా వెళ్తుంటాయి. యాగంటిపల్లె దాటిన తర్వాత గాలేరు నగరి బ్రిడ్జి నుంచి మీరాపురం, పాతపాడు వరకు రోడ్డు గుంతలు పడి అధ్వానంగా తయారైంది. గుంతలుగా ఉన్న రోడ్డును ప్యాచింగ్ పనులకు నోచుకోవడం లేదు. రోడ్డుకు మరమ్మతు చేయాలని ఆర్‌అండ్‌బీ శాఖాధికారులకు విన్నవించినా ఫలితం లేదని ప్రయాణీకులు వాపోతున్నారు.


బనగానపల్లె- గుత్తి రహదారిలో అధ్వానంగా ఉన్న బీటీ రోడ్డు

రూ.11 లక్షలతో శాంతి రథం

ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే బీసీ


శాంతి రథాన్ని ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి, సోదరులు

బనగానపల్లె, జనవరి 28: పార్థివ దేహాల తరలింపునకు శాంతి రథాన్ని, ఫ్రీజర్ బాక్సును మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బీసీ రాజా రెడ్డి, బీసీ రామనాథరెడ్డిలు ఆదివారం టీడీపీ కార్యాలయం ఆవరణలో ప్రారంభించారు. తమ తల్లిదండ్రులు దివంగత బీసీ లక్ష్మమ్మ, బీసీ గుర్రెడ్డి జ్ఞాపకార్థం సొంత నిధులు రూ.11 లక్షలు వెచ్చించి శాంతి రథం, ఫ్రీజర్ బాక్సును ఏర్పాటు చేయించారు. ఆదివారం నుంచి శాంతి రథంతో పాటు ఫ్రీజర్ బాక్సును అందుబాటులోకి తీసుకువచ్చారు. నియోజవర్గంలోని ప్రజలు ఉచితంగా శాంతిరథం, ఫ్రీజర్‌బాక్సులు అందించనున్నట్లు తెలిపారు. బనగానపల్లె నియోజకవర్గంలోని బనగానపల్లె, అవుకు, కొలిమిగుండ్ల, సంజామల, కోవెలకుంట్ల మండలాల్లో కులమతాలతో నిమిత్తం లేకుండా అన్ని వర్గాల వారు మృతి చెందిన వారి అంతిమయాత్ర, దహనసంస్కారాల నిమిత్తం ఈ శాంతిరథం, ఫ్రీజర్‌బాక్స్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. నియోజవర్గంలోని ప్రజలు ఉచితంగా వీటిని వినియోగించుకోవచ్చని తెలిపారు. శాంతి రథం, ఫ్రీజర్ బాక్సు కావాల్సిన వారు 630594918 నంబరుకు కాల్ చేయాలని బీసీ సోదరులు తెలిపారు.

చంద్రబాబు హయాంలోనే బీసీలకు పెద్ద పీట


సంఘీభావం తెలుపుతున్న టీడీపీ బీసీ సంఘం నాయకులు

కొలిమిగుండ్ల, జనవరి 28: చంద్రబాబు హయాంలోనే బీసీలకు పెద్దపీట వేశారని టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గోవిందనాయుడు అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన కొలిమిగుండ్ల షిర్డిసాయి ఆడిటోరియంలో జయహో బీసీ కార్యక్రమం మండల టీడీపీ కన్వీనర్ మూలే రామేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంఘం నాయకులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గోవిందనాయుడు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో బీసీలు వేధింపులు, హత్యలకు గురవుతున్నారన్నారు. చంద్రబాబు బీసీల అభివృద్ధికి కార్పొరేషన్ల ద్వారా రుణాలు మంజూరు చేసి చేసి వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేశారన్నారు. నంద్యాల జిల్లా బీసీ సెల్ కార్యదర్శి భూషన్న, బాలనాయుడు, బెలుం హుసేనయ్య, తెలుగు యువత మండల ప్రధాన కార్యదర్శి నంద్యాల ప్రసాద్, అరుణ్‌కుమార్, తిరుపాల్‌బాబు, టైలర్ వెంకట రాముడు, డిష్ గోపాల్, రామలక్ష్మన్న, అందెరాము, కోటపాడు శివరామిరెడ్డి, వీఆర్ లక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.

బీజేపీని ఇంటికి సాగనంపాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

డోన్(రూరల్), జనవరి 28: వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీని చిత్తుగా ఓడించి ఇంటికి సాగనంపాలని సీపీఎం పట్టణ, మండల కార్యదర్శులు కోయలకొండ నాగరాజు, నక్కి శ్రీకాంత్‌లు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రానికి విభజన హామీలను అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ సమావేశంలో సీపీఎం అనుబంధ సంఘాల నాయకులు శివరాం, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు

చాగలమర్రి, జనవరి 28: సస్యరక్షణతో అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ అధికార ప్రతినిధి యోగిరెడ్డి అన్నారు. ఆదివారం డి.వనిపెంట, శెట్టివీడు గ్రామాల్లో రైతులు సాగు చేసిన మొక్కజొన్న, సజ్జ పంటలపై అగ్రికల్చర్ డిప్లొమా విద్యార్థులకు అవగాహన కల్పించారు. యోగిరెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారన్నారు. చీడ పీడల నివారణలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో విత్తన కంపెనీ మేనేజర్ పవన్, రహమ్‌తుల్లా, విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలి


మాట్లాడుతున్న రామసుబ్బయ్య

ప్యాపిలి, జనవరి 28: టీడీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు గండికోట రామసుబ్బయ్య పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో బూత్‌స్థాయి కమిటీ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రామసుబ్బయ్య మాట్లాడుతూ కొత్తగా విడుదల చేసిన ఓటరు జాబితాను పరిశీలించాలని సూచించారు. ఓట్లను తొలగించిన, బోగస్ ఓట్లు ఉన్నా అధికారులకు వెంటనే పిర్యాదు చేయాలన్నారు. నాయకులు ఆర్‌ఈ రాఘవేంద్ర, చిన్నసుంకయ్య, రామ్మోహన్ యాదవ్, ఎస్ మధు, చల్లా వీరాంజినేయులు, సుదర్శన్ పాల్గొన్నారు.

జోరుగా జొన్న కోతలు


జొన్న పంటను కోస్తున్న వ్యవసాయ కూలీలు

బనగానపల్లె, జనవరి 28: మండలంలో జొన్న కోతలు ప్రారంభమయ్యాయి. ఖరీఫ్‌లో వేసిన జొన్న, రబీలో వేసిన పప్పుశనగ పంటలను రైతులు వ్యవసాయ కూలీలతో కలసి కోతలు కోస్తున్నారు. ఈ ఏడాది వర్షాభావంతో ఎకరాకు కనీసం జొన్న 4 నుంచి 5 బస్తాలు మాత్రమే వస్తున్నట్లు రైతులు వాపోతున్నారు. అలాగే పప్పుశనగ కూడా 4 బస్తాల నుంచి 5 బస్తాలు కూడా వచ్చే పరిస్థితి లేదని, కనీసం పెట్టుబడి ఖర్చులకు కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారు. దీనికి తోడు పంటలు కోత కోయాలంటే రోజుకు రూ.400నుంచి రూ.500 వరకు వ్యవసాయ కూలీలు డిమాండ్ చేస్తుండడంతో రైతులు దిక్కుతోచని స్థితితో కొట్టుమిట్టాడుతున్నారు.